
సాక్షి
పల్నాడు
ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



వేంకటేశ్వర స్వామికి పూజలు

మాచర్ల: మాచర్ల బస్టాండ్ సెంటర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక అర్చన, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 534.10 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,067 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ఈవీఎం వీవీప్యాడ్స్ పరిశీలన

ఫిరంగిపురం: రేపూడిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోడౌన్‌లో భద్రపర్చిన ఈవీఎం వీవీప్యాడ్స్‌ను ఆర్డీఓ శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు.

న్యూస్‌రీల్

సాగర్ కుడి కాలువ పరిధిలో వారబందీ అమలు

నరసరావుపేట:నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గినందున సాగర్ కుడికాలువ పరిధిలో వారబందీ అమలు చేస్తున్నట్లు ఎన్‌ఎస్పీ ఈఈ డీవీ సుబ్బారావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వారబందీలో భాగంగా పక్షంలో తొమ్మిది రోజులు లింగంగుంట్ల సర్కిల్ పరిధిలోని కాలువలకు మాత్రమే సరఫరా చేస్తామని తెలిపారు. వారబందీ అమలులో భాగంగా ఈనెల 28 నుంచి లింగంగుంట్ల సర్కిల్ పరిధిలోని 10ఆర్ మేజర్ కాలువ, పెదనందిపాడు బ్రాంచ్ కాలువ(పీబీసీ), అద్దంకి బ్రాంచ్ కాలువ(ఏబీసీ)లకు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అవసరం మేరకు వాడుకొని, నీటి వృథాను అరికట్టాలని రైతులకు సూచించారు.

వీరాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.89,065




నాదెండ్ల: గణపవరం–కావూరు డొంక రోడ్డులో కొలువైయున్న వీరాంజనేయస్వామి ఆలయంలోని హుండీని శనివారం కమిటీ సభ్యులు లెక్కించారు. హుండీ ఆదాయం రూ.89,065 వచ్చినట్లు తెలిపారు. దేవస్థానం మూడో వార్షికోత్సవం ఈనెల 14, 15 తేదీల్లో వైభవంగా జరిగిన విషయం విదితమే. వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారిని చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కాట్రు శ్రీనివాసరావు, సభ్యులు నన్నపనేని శ్రీనివాసరావు, కాట్రు కృష్ణారావు, శివరామకృష్ణ, కె శ్రీనివాసరావు, శ్రీపతి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

భృంగి వాహనంపై మల్లేశ్వరుడు



మంగళగిరి టౌన్: మంగళగిరిలోని శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శనివారం 5వ రోజు స్వామి వారు భృంగి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మంగళగిరి తహసీల్దార్ కె.దినేష్ రాఘవేంద్ర ప్రత్యేక పూజలు చేశారు. మాజేటి సూర్య వేణుగోపాల కృష్ణ దంపతులు, ఎల్‌కే శర్మ దంపతులు ఉత్సవ కైంకర్య పరులుగా వ్యవహరించారు. దేవస్థాన ఈవో జె.వి. నారాయణ వేడుక నిర్వహణను పర్యవేక్షించారు.

గోవాడలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు



అమర్తలూరు(వేమూరు): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా అమర్తలూరు మండలం గోవాడ గ్రామంలో వేంచేసియున్న బాల కోటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులకు పడకుండా ఉండేందుకు ఆలయంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. వీఐపీలకు ప్రత్యేక క్యూ లైన్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని దేవస్థానం కార్య నిర్వహణాధికారి అశోక్ కుమార్ తెలిపారు. ప్రతి క్యూ లైన్ వద్ద పురుషులు, మహిళా కానిస్టేబుళ్లను నియమిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధైర్యపడకుండా శ్రీ బాలకోటేశ్వరస్వామి కటాక్షం పొందాలని కోరారు. 26వ తేదీ రాత్రి భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

25న ఉమ్మడి జిల్లా ఫెన్సింగ్ జట్లు ఎంపిక

లక్ష్మీపురం:గుంటూరు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా అండర్–14 బాల బాలికల ఫెన్సింగ్ టీంల ఎంపిక ఈనెల 25న నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి డి.అశోక్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు పాత్తూరులోని ఏసీఎంఈ స్కూల్‌లో నిర్వహించే ఎంపికలకు ఉమ్మడి జిల్లాలోని 14 ఏళ్ల వయసు కలిగి ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు కార్డు కలిగి వారు అర్హులని ఆయన తెలిపారు.

"ఏరా అబ్బాయిలూ మా ఊరికి కూడా వచ్చారా.. ఈ ఊళ్లో మీకెవర్రా ఓట్లేసేది? వెళ్లండి.. వెళ్లండి..మీకు ఓట్లున్న దగ్గరికి?" అంటూ పీడీఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు ఓట్లేయాలని అడిగేందుకు వేమూరు నియోజకవర్గంలోని ఒక గ్రామంలో పర్యటిస్తున్న ఆయన మద్దతుదారులను ఉద్దేశించి పచ్చ పార్టీ నేత చేసిన వ్యాఖ్యలు.

"ఒక్కరోజు ఆగండి డబ్బులొస్తున్నాయి. ఓటుకు రూ.5 వేలు చొప్పున ఇస్తాం. వైఎస్సార్ సీపీ నేతలు పిలిచినా పలకవద్దు. అధికారంలో ఉన్నది మేమే. మీకు ఏ పథకం ఆగకుండా అందాలంటే మాకు ఓటేయండి." అంటూ బాపట్ల రూరల్ మండలంలోని ఓ గ్రామంలో శనివారం ఉదయం పట్టభద్రుల ఓటర్లనుద్దేశించి స్థానిక పచ్చ పార్టీ నేత మాట్లాడిన మాటలు.

"మీరు సక్రమంగా ఉద్యోగం చేసుకోవాలంటే ఈ ఐదేళ్లు మా సపోర్టు కావాలి. ఉద్యోగులందరికీ చెప్పండి. మీకు అవసరమైన పని చేసిపెడతాం. కాదంటే ఇబ్బందులు తప్పవు" అంటూ రేపల్లె నియోజకవర్గంలోని ఉపాధ్యాయులకు పచ్చపార్టీ ముఖ్యనేత బెదిరింపులు.

ప్రలోభాలు..బెదిరింపులు

- ఓట్లు వేయకుంటే కష్టాలే
- బదిలీలు తప్పవని ఉద్యోగులకు హెచ్చరికలు
- రేపల్లె, వేమూరు ప్రాంతాల్లో పీడీఎఫ్ మద్దతుదారులకు బెదిరింపులు
- ఖాతరు చేసేదిలేదంటున్న ఉద్యోగులు, పట్టభద్రులు
- నిరుద్యోగులకు డబ్బు ఎర
- ఓటుకు రూ.5 వేలు ఇస్తామంటూ ప్రలోభాలు
- అవసరమైన చోట ఎక్కువ మొత్తం ఇచ్చేందుకు సన్నద్ధం
- పీడీఎఫ్ అభ్యర్థికి పెరుగుతున్న మద్దతు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం కూటమి అడ్డదారులు



సాక్షి ప్రతినిధి,బాపట్ల: ఇలా చెప్పుకుంటూ పోతే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పచ్చపార్టీ బెదిరింపుల పర్వానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. మొన్నటి వరకూ గెలుపు మాదేనన్న గర్వంతో ఉన్న మాజీ మంత్రి, పచ్చపార్టీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు పీడీఎఫ్ అభ్యర్థి కే.ఎస్.లక్ష్మణరావు చుక్కలు చూపిస్తున్నారు. టీడీపీ అభ్యర్థి పచ్చపార్టీ కేడర్‌ను నమ్ముకుంటే పీడీఎఫ్ అభ్యర్థి ఉద్యోగులు, పట్టభద్రులతోపాటు ప్రజలను నమ్ముకున్నారు. ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలతోపాటు ఉద్యోగులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కూటమి సర్కార్ తుంగలో తొక్కడంతో ఇప్పుడు అన్ని వర్గాల మద్దతు పీడీఎఫ్ అభ్యర్థికి లభిస్తోందన్నది విశ్లేషకుల అంచనా. దీంతో బెంబేలెత్తిన పచ్చపార్టీ బెదిరింపులు, ప్రలోభాలతో ఎన్నికల్లో నెగ్గేందుకు సన్నద్ధమైంది. ఇందులో భాగంగా ఒక్కొక్క ఓటుకు రూ.3 వేల నుంచి రూ.5 వేలు పంచేందుకు పచ్చ నేతలు సిద్ధమయ్యారు. బాపట్ల నియోజకవర్గంలో రూ.5 వేలు పంచుతున్నట్లు పచ్చపార్టీ నేత ప్రచారం చేస్తుండగా వేమూరులో రూ.3 వేలు, రేపల్లెలో రూ.5 వేలు పంచనున్నట్లు అక్కడి పచ్చనేతలు ప్రచారం చేస్తున్నారు.

టీడీపీ అభ్యర్థి ఆలపాటి డబ్బులు ఇవ్వాలని, అంత మొత్తంలో సొంతంగా పంచడం సాధ్యం కాదని ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు మెలిక పెట్టినట్లు సమాచారం. డబ్బుల పంపిణీ విషయంలో రేపటిలోగా నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యేలకు మంత్రులు తెలిపినట్లు తెలుస్తోంది. పీడీఎఫ్ చాపకింద నీరులా ముందుకు వెళుతోందని, ఈ సమయంలో అసమ్మతి, అసంతృప్తులని కూర్చుంటే నిండా మునుగుతామని మంత్రులు ఎమ్మెల్యేలకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినట్లు సమాచారం. టీడీపీ అభ్యర్థి ఈ ఎన్నికల్లో ఓడితే పరువు గంగలో కలవడం సంగతి దేవుడెరుగు ప్రతిపక్ష వైఎస్సార్ సీపీని నిలువరించడం సాధ్యంకాదని మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్‌లు ఎమ్మెల్యేలకు చెప్పినట్లు సమాచారం.

సర్కారుకు బుద్ధి చెప్పేందుకు సిద్ధం

పచ్చపార్టీ బెదిరించినా, ప్రలోభపెట్టినా ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత పెంచుకున్న ఉద్యోగులు వినే పరిస్థితి కనిపించడంలేదు. దీంతో డబ్బులు ఎంతైనా ఖర్చుచేసి నిరుద్యోగులతోపాటు ఉద్యోగులను కొనుగోలు చేసేందుకు పచ్చపార్టీ వ్యూహం రచించింది. అయితే పీడీఎఫ్ అభ్యర్థి కే.ఎస్.లక్ష్మణరావును గెలిపించి సార్వత్రిక ఎన్నికల వేల హామీలు ఇచ్చి వంచించిన కూటమి సర్కార్‌కు తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు ఉద్యోగులతోపాటు పట్టభద్ర ఓటర్లందరూ సన్నద్ధమైనట్లు క్షేత్రస్థాయి పరిస్థితులున్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

రగులుతున్న ద్వితీయ శ్రేణి నాయకత్వం

ఈ ఎన్నికలకు కూటమిలోని జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలతోపాటు పచ్చపార్టీ కేడర్ చాలా వరకు అభ్యర్థి ఆలపాటికి వ్యతిరేకంగా ఓటు వేసేందుకు సిద్ధమైనట్లు ఆ పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. ఒకప్రక్క పచ్చపార్టీ ముఖ్యనేతలు కూటమి అభ్యర్థి ఆలపాటి రాజా విజయానికి పనిచేస్తుంటే అసంతృప్తులతో రగిలిపోతున్న పచ్చపార్టీ ముఖ్యనేతలతోపాటు ద్వితీయ శ్రేణి నేతలు ఆలపాటిని ఓడించి అధిష్టానానికి కనువిప్పు కలిగించాలన్న ఉద్దేశంతో ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

పచ్చ నేతల తీరుపై మిత్రుల ఆగ్రహం

కూటమి విజయానికి అహర్నిశలు శ్రమించినా అధికారంలోకి వచ్చాక తమను పచ్చపార్టీ దూరం పెట్టిందని జనసేన, బీజేపీలు ఆగ్రహంతో ఉన్నాయి. ఈ ఎన్నికల్లో పచ్చపార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేసి తమ ప్రాధాన్యత తెలియజెప్పాలని ఆయా పార్టీల కేడర్ నిర్ణయించినట్లు సమాచారం. దీంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పచ్చపార్టీ అభ్యర్థి ఆలపాటి గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నట్లు సొంత పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అన్నివర్గాల మద్దతుతో పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు ముందంజలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

చేతులెత్తేసిన ఆలపాటి రాజా

ఎమ్మెల్యేలపైనే ఎన్నికల ఖర్చుల భారం

సాక్షి ప్రతినిధి,గుంటూరు:పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు తమకు తలనొప్పిగా మారాయని కూటమి ఎమ్మెల్యేలు వాపోతున్నారు. ఈ నెల 27వ తేదీన ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి మాజీ మంత్రి ఆలపాటి రాజాకు పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావుకు మధ్య హోరాహోరీగా పోటీ నడుస్తోంది. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న లక్ష్మణరావు పనితీరు పట్ల ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, పట్టభద్రులలో సానుకూల అభిప్రాయం ఉంది. కూటమిలోనే కొన్ని పక్షాలు లక్ష్మణరావుకు మద్దతుగా నిలుస్తున్నాయి. ఆయన నామినేషన్ రోజున జనసేన పార్టీకి చెందిన నేతలు మద్దతు ప్రకటించి వెళ్లిన సంగతి తెలిసిందే.

ఒక్కసారిగా ప్లేటు ఫిరాయింపు

ఆలపాటి విషయంలో పార్టీలోనే తలనొప్పులు ఉన్నాయి. పొన్నూరు ఎమ్మెల్యే డి.నరేంద్ర తొలి నుంచి ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించడంతోపాటు ప్రచారానికి దూరంగా ఉంటూ వస్తున్నారు. దీంతో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును రంగంలోకి దించి ప్రచారం చేయిస్తున్నారు. పరిస్థితులు వ్యతిరేకంగా మారుతుండటంతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. రెండు జిల్లాల ప్రజాప్రతినిధులతో రెండుసార్లు భేటీ అయ్యారు. ఆలపాటి రాజాను గెలిపించే బాధ్యత ఎమ్మెల్యేలపై పెట్టారు. ఇప్పటి వరకు ఓటుకు రూ.ఐదు వేలు ఇవ్వడానికైనా సిద్ధమని, కూటమి నాయకులకు కూడా తాయిలాలు ఇస్తానని చెబుతూ వచ్చిన ఆలపాటి ఒక్కసారిగా ప్లేటు ఫిరాయించారు.

మంత్రి లోకేష్‌తో ఫోన్ చేయించి మరీ..

సీఎం ఎన్నికల బాధ్యతను ఎమ్మెల్యేలపై పెట్టినందున ఆయా నియోజకవర్గాల్లో ఖర్చు కూడా వారే పెట్టుకోవాలని చెబుతుండటంతో రాజా గెలుపు కోసం తామెందుకు ఖర్చు చేయాలని ప్రశ్నిస్తున్నారు. అడ్డం తిరిగిన ఎమ్మెల్యేలకు లోకేష్‌తో ఫోన్లు చేయిస్తున్నట్లు సమాచారం. పల్నాడు జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యేకి లోకేష్ ఫోన్‌చేసి మాట్లాడినట్లు తెలిసింది.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడండి

- కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- తిరునాళ్లపై అధికారులతో సమీక్ష
- ఎస్పీతో కలసి కోటప్పకొండలో పర్యటన



కోటప్పకొండలో తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నరసరావుపేట: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో తిరునాళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభలు తరలింపునకు అంతరాయం కలుగకుండా రోడ్లను తీర్చిదిద్దాలన్నారు. ప్రభల రాకపోకలకు విద్యుత్ వైర్లు తగలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. క్యూలైన్‌లో ఉండే భక్తులకు మంచి నీటి ప్యాకెట్లు అందజేయాలని కోరారు. కొండ కింద నుంచి పైవరకు బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారి కె.మధులత, రోడ్లు భవనాల శాఖ అధికారి రాజానాయక్, జిల్లా పంచాయతీ అధికారి ఎం.వీ.భాస్కరరెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోటప్పకొండ వద్ద ఏర్పాట్లను ఎస్పీ కంచి శ్రీనివాసరావు, అధికారులతో కలిసి పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు.

రక్షణ కరువైన వన్యప్రాణులు


- అక్రమ విద్యుత్ తీగలతో వధ
- యథేచ్ఛగా సాగుతున్న వేట



బొల్లాపల్లి బీట్ పరిధిలో నీరు లేక ఖాళీగా దర్శనమిస్తున్న సాసర్‌పిట్

బొల్లాపల్లి: వన్య ప్రాణులకు రక్షణ కరువైంది. రక్షించాల్సిన ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అటవీ శాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన నీటి కుంటలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దాహార్తిని తీర్చుకోవడానికి అటవీ ప్రాంతం వెలుపలికి వస్తున్న జంతువులు వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకొని ప్రాణాలు కోల్పోతున్నాయి. వినుకొండ రేంజ్ పరిధిలో మండలంలో అత్యధిక అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఈ అటవీ ప్రాంతంలో వనబోతులు, దుప్పులు, జింకలు, నెమళ్లు, కొండ గొర్రెలు, అడవి కుక్కలు, ఎలుగు బంటి తదితర జంతువులు ఉన్నాయి. ఈ అడవి జంతువులు తరచూ దుండగుల ఉచ్చులో చిక్కుకొని ప్రాణాలు కోల్పోతున్నాయి. నీటి కోసం వచ్చే వన్యప్రాణులను వేటగాళ్లు అక్రమంగా విద్యుత్ తీగలు తగిలించి వాటిని వధించి మాంస విక్రయాలు జరుపుతున్నారు. వన్యప్రాణుల వేట బొల్లాపల్లి, నాయుడుపాలెం సెక్షన్‌ల్లో తరచూ జరుగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల అక్రమ కరెంట్‌తో బండ్లవాగు, ఊటకుంట పరిధిలోని అటవీ ప్రాంతాల్లో దుండగుల చేతిలో అటవీ జంతువులు వధించిన సందర్భాలు ఉన్నాయి. ఆ శాఖ అధికారులు వధించిన ప్రాంతాన్ని గుర్తించి ఆనవాళ్లు లేకుండా జంతు అవశేషాలను మరో ప్రదేశానికి తరలించి గుట్టుచప్పుడు కాకుండా పూడ్చివేశారని స్థానికులు చెబుతున్నారు. మండలంలో బొల్లాపల్లి, రావులాపురం పరిధిలో ఆయా బీట్‌ల్లో ఆ శాఖ పరిధిలో ఏర్పాటు చేసిన సాసర్‌పిట్‌లో నీటిసరఫరా జరిగినట్లయితే వన్యప్రాణులకు రక్షణగా ఉంటుందని స్థానికులు అంటున్నారు. ప్రతిఏటా ఆయా సాసర్‌పిట్‌ను వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు నీటితో నింపి వాటిని రక్షించాల్సి ఉంది. ఆ శాఖ అధికారులు ఎప్పుడో గుర్తు వచ్చినప్పుడు నీటి సరఫరా చేయడం జరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. కొన్నేళ్ల కిందట యథేచ్ఛగా అటవీ జంతువుల అక్రమ విక్రయాలు జోరుగా సాగాయి. అప్పట్లో ఆ శాఖ అధికారులు నాయుడుపాలెం, బొల్లాపల్లి సెక్షన్ల పరిధిలో కొన్ని ద్విచక్రవాహనాలను స్వాధీనపరచుకున్న సంఘటనలు ఉన్నాయి. వన్యప్రాణుల వేట అరికట్టి వాటిని రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం



ప్రతిఏటా జనవరి నుంచి మూడు నెలలపాటు బొల్లాపల్లి, రావులాపురం బీట్‌ల్లోని 20 సాసర్‌పిట్‌లను అడవి జంతువుల దాహార్తిని తీర్చడానికి నీటితో నింపుతాం. గత నెలలో కొన్నిచోట్ల నీరు పోశాం. అయితే కొన్ని ప్రదేశాల్లో కొందరు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వేసవి దృష్ట్యా అటవీ జంతువుల దాహార్తిని తీరుస్తారు. ఇటీవల అక్రమ విద్యుత్‌తో వన్యప్రాణులను వధించిన ఘటన తెలియదు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

సి.మాధవరావు,
వినుకొండ రేంజ్ అధికారి

చిన్నారులకు జ్ఞాన జ్యోతి వెలుగులు

- మారనున్న అంగన్‌వాడీ చదువులు
- మూడు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో తరగతులు
- ముగిసిన మొదటి విడత శిక్షణ
- జిల్లాలో నేటి నుంచి రెండో విడత శిక్షణ ప్రారంభం



శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు

జిల్లా సమాచారం

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు:	09
జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు:	2,031
0–3 ఏళ్ల లోపు చిన్నారులు :	61,937
3–6 ఏళ్ల లోపు చిన్నారులు:	28,621
జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలు :	1,976
జిల్లాలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు:	71

సత్తెనపల్లి: పిల్లల ప్రగతి కోసం కేంద్రం మరో పథకానికి శ్రీకారం చుట్టింది. భావి భారతం విజ్ఞానంతోపాటు సంపూర్ణ ఆరోగ్యమూ కలిగి ఉండాలన్న లక్ష్యంతో పోషణ్ భీ పడాయి భీ పథకం అమలు చేస్తుంది. ముఖ్యంగా చిన్నారులు తొలి అడుగులు వేసే అంగన్‌వాడీ కేంద్రాలపై దృష్టి పెట్టింది. జాతీయ విద్యా విధానం అమల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మారబోతున్నాయి. 3–6 సంవత్సరాల మధ్య వయసుగల చిన్నారులకు ఆటపాటలతో కూడిన చదువులు అందించేలా జ్ఞాన జ్యోతి పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు అనుగుణంగానే కేంద్రాల్లో సరికొత్త చదువులకు విద్యాశాఖ అధికారులు పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేశారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే....

పిల్లల అభివృద్ధికి మొదటి ఆరేళ్ల వయస్సు చాలా కీలకం. మానసిక నిపుణుల సూచనల మేరకు ఎన్‌ఈపీలో ఈ వయసు వారికి ప్రాధాన్యం ఇచ్చారు. 0–6 ఏళ్ల వయసు గల పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలే వారి భవిష్యత్తుకు దిక్సూచిగా నిలవాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలోనే బలమైన పునాదులు వేశారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు పెంపొందించడంతోపాటు ప్రతి కేంద్రానికి ఆట వస్తువుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ

జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈనెల 13 నుంచి 15వరకు మూడు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఈనెల 18 నుంచి 20 వరకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని 1,976 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 71మంది సూపర్‌వైజర్లు శిక్షణలో పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక శిక్షణ గురువారంతో మొదటి దశ ముగిసింది. ఈనెల 22 నుంచి 25 వరకు రెండో దశ శిక్షణ ఇవ్వనున్నారు. మొదటి దశలో హాజరుకాని వారు కూడా రెండో దశలో హాజరయ్యేలా అవకాశం కల్పించారు.

మూడేళ్ల సర్టిఫికెట్ కోర్సు...

ఈ శిక్షణ అంగన్‌వాడీలకు మూడేళ్ల సర్టిఫికెట్ కోర్స్. మూడేళ్ల వ్యవధిలో ఏడాదికి 40 రోజులు చొప్పున మొత్తం 120 రోజులు శిక్షణ ఇస్తారు. తొలిదశలో 20 రోజులు, మలిదశలో 20 రోజులు కొనసాగనున్న ఈ శిక్షణ ఆరు రోజులు ఆఫ్‌లైన్, మిగిలిన 14 రోజులపాటు ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు.

జ్ఞానజ్యోతి లక్ష్యం ఇదే ...

- ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్ (పూర్వ ప్రాథమిక విద్య), పునాది అభ్యాసన కొనసాగింపు కోసం రోడ్డు మ్యాప్ అభివృద్ధి చేయడం
- అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు 1–2 తరగతుల ఉపాధ్యాయుల సామర్థ్యలను పెంపొందించడంలో భాగంగా వారికి వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వడం
- జిల్లాలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు, వాటికి అనుసంధానంగా ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి చేయడం
- మాతా శిశు సంక్షేమ శాఖ విద్యాశాఖ సర్వ శిక్ష అభియాన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ చొరవతో సపోర్టింగ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రోగ్రాం పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తల కోసం నిర్దేశించిన ఈ శిక్షణ పేరు జ్ఞాన జ్యోతి ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ.
- 3–6 ఏళ్ల చిన్నారులకు ఈ శిక్షణ ద్వారా లబ్ధి చేకూరనుంది. పిల్లల బాల్యారంభా సంరక్షణ, అభివృద్ధే ఈ కార్యక్రమం లక్ష్యం.
- శారీరక అభివృద్ధి, సామాజిక భావోద్వేగ, నైతిక అభివృద్ధి, మేధాభివృద్ధి, భాష–అక్షరాస్యత అభివృద్ధి, సౌందర్య–సాంస్కృతిక అభివృద్ధి అనే ఐదు అంశాల ప్రామాణికంగా పసి భవితకు భరోసా ఇవ్వడమే లక్ష్యంగా శిక్షణ కొనసాగుతుంది.

ఇంటర్ పరీక్షలకు చురుగ్గా ఏర్పాట్లు

- జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 32,434మంది విద్యార్థులు



రాత పత్రాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది

నరసరావుపేటఈస్ట్: ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు బోర్డు అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం కానుండటంతో ఏర్పాట్లలో అధికారులు, సిబ్బంది తలమునకలై ఉన్నారు. మార్చి 1 నుంచి 19వ తేదీ వరకు ప్రథమ, మార్చి 3నుంచి 20వ తేదీ వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. జిల్లా పరిధిలో 48 పరీక్ష కేంద్రాలలో 32,434 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో మొదటి సంవత్సరం 17,905 విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 14,529 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఆయా పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించారు. ఇంటర్మీడియేట్ బోర్డు నుంచి జిల్లా కేంద్రానికి చేరుకున్న జవాబు పత్రాలను శనివారం ఆయా పరీక్ష కేంద్రాలకు పంపుతున్నారు. మరో రెండు రోజుల్లో రానున్న ప్రశ్నపత్రాలను భద్రపరిచేందుకు జిల్లా వ్యాప్తంగా 15 ప్రాంతాలలో 16 పోలీస్‌స్టేషన్‌లను ఎంపిక చేశారు. పోలీస్‌స్టేషన్‌ల నుంచి ప్రశ్నపత్రాలను పంపిణీ చేసేందుకు కస్టోడియన్‌లను నియమించారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణ.. నో ఫోన్ జోన్

పరీక్ష కేంద్రాలలో విద్యార్థులు పరీక్ష రాసే ప్రతి గదిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్ష జరుగుతున్న సమయంలో సీసీ కెమెరాల లైవ్ స్ట్రీమింగ్‌తో జిల్లా ఇంటర్మీడియేట్ కార్యాలయంలో పర్యవేక్షణకు ఏర్పాట్లు చేశారు. గత అనుభవాల దృష్ట్యా ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్ష కేంద్రాలను నో ఫోన్ జోన్‌గా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వేసవి తీవ్రత పెరుగుతుండటంతో తాగునీరు, గాలి, వెలుతురు ఉండేలా ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ఏర్పాట్లు పూర్తయ్యాయి...

ఇంటర్ పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలను పరిశీలించి వసతులు కల్పిస్తున్నాం. ఆయా కేంద్రాలకు జవాబు పత్రాలను పంపిస్తున్నాం. పరీక్ష సమయంలో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం.

–ఎం.నీలావతిదేవి,
జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి

క్లుప్తంగా

వరికపూడిశెల ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

వినుకొండ : వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి రానున్న అసెంబ్లీ సమావేశాల్లో నిధులు కేటాయించి, పనులు మొదలు పెట్టాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ ఏ ప్రభుత్వం వచ్చినా ప్రాజెక్టు నిర్మాణాలకు శంకుస్థాపన మాత్రమే చేసి, పనులు మొదలు పెట్టడం లేదని తెలిపారు. వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం చిత్తశుద్ధితో బడ్జెట్‌లో నిధులు కేటాయించి నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వి.కోటానాయక్, తోట ఆంజనేయులు, న్యాయవాదులు పి.జె.లూకా, మూర్తి, ప్రజా సంఘాల నాయకులు రూబెన్, ఆర్.కృష్ణానాయక్, రాంజీనాయక్, కె.హనుమంతరెడ్డి, రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డ్ మృతిపై కేసు నమోదు

చిలకలూరిపేట టౌన్: పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి చెందిన సెక్యూరిటీ గార్డ్ మృతి చెందిన సంఘటనపై పట్టణ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని 52 ఎకరాల్లో నివాసం ఉండే దాసరి పుల్లారావు(60) నాలుగు నెలల కిందట నరసరావుపేట సెంటర్లోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా చేరాడు. ఆస్పత్రి బాత్రూంలో ఈనెల 20న కాలుజారి పడ్డాడు. ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. జీజీహెచ్ నుంచి వచ్చిన రిపోర్టు ఆధారంగా అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎకరాకు రూ.50 లక్షలిస్తేనే న్యాయం జరిగేది

ఆర్డీఓతో గోదావరి – పెన్నా అనుసంధానంలో భూములు కోల్పోతున్న రైతులు

నకరికల్లు: ప్రాజెక్టు కోసం తీసుకుంటున్న భూములకు ఎకరాకు రూ.50లక్షల చొప్పున పరిహారం ఇస్తేనే తమకు సరైన న్యాయం జరుగుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి – పెన్నా అనుసంధానంలో భాగంగా మండలంలోని నర్సింగపాడు గ్రామంలో భూములు కోల్పోతున్న రైతులతో ఆర్డీఓ జీవీ రమణకాంత్‌రెడ్డి శనివారం మాట్లాడారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం నర్సింగపాడు గ్రామంలో ఎకరాకు రూ.6లక్షల విలువ ఉందన్నారు. దానికి రెండున్నర రెట్లు పరిహారం చెల్లిస్తామని రైతులకు తెలిపారు. పరిహారంపై రైతుల అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆర్డీఓ వద్దకు వచ్చి మార్కెట్ ధర ప్రకారం తమ భూముల విలువ ఎకరా రూ.60లక్షల నుంచి రూ 1కోటి వరకు ఉందన్నారు. మూడు పంటలు పండే భూములను ప్రాజెక్టుకు తీసుకుంటే తాము ఉపాధి కోల్పోతామని వాపోయారు. భూసేకరణలో కోల్పోతున్న భూమి ఎకరాకు రూ.50లక్షల పరిహారం ఇస్తే



ఆర్డీఓ జీవీ రమణకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నర్సింగపాడు, నకరికల్లు గ్రామాల రైతులు

భూమి కోల్పోయిన రైతుకు సరైన న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆర్డీఓ జీ.వి.రమణకాంత్‌రెడ్డి స్పందిస్తూ జాయింట్ కలెక్టర్ దృష్టికి రైతుల అభిప్రాయాన్ని తీసుకువెళతామని అన్నారు. తహశీల్దార్ కె.పుల్లారావు, ఇరిగేషన్ శాఖ ఏఈఈలు చల్లా శ్రీను, ఎస్.వి.ఎస్.ఎల్.రేవతి, పి.సౌజన్య, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

మండలంలో సేకరిస్తున్న భూములివే..

గోదావరి–పెన్నా అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా నకరికల్లు మండలంలో మొత్తం 704.48 ఎకరాల భూమి సేకరిస్తున్నట్లు తెలిపారు. సత్తెనపల్లి డివిజన్ పరిధిలో 5 చోట్ల పంప్‌హౌస్‌లు వస్తున్నాయని అన్నారు. అమరావతి మండలంలో 2, క్రోసూరు మండలంలో 1, రాజుపాలెం మండలంలో 1, నకరికల్లు మండలం నర్సింగపాడు వద్ద ఒక పంప్‌హౌస్ నిర్మించనున్నట్లు తెలిపారు. నర్సింగపాడు వద్ద నిర్మించనున్న పంప్‌హౌస్ కోసం 78 ఎకరాల భూమి సేకరిస్తున్నట్లు తెలిపారు. పంప్ హౌస్, కెనాల్ నిర్మాణం కోసం నర్సింగపాడు గ్రామంలో 341.90 ఎకరాలు, నకరికల్లు పరిధిలో 283 ఎకరాలు, గుండ్లపల్లి గ్రామ పరిధిలో 78 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులతో మాట్లాడి పరిహారంపై వారి అభిప్రాయాన్ని నివేదిక పంపనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరగాలి

డీఈఓ చంద్రకళ

నాదెండ్ల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు పని చేసినపుడే తల్లిదండ్రులకు నమ్మకం పెరిగి గుర్తింపు వస్తుందని డీఈవో ఎల్ చంద్రకళ చెప్పారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా ఎంపికైన నేపథ్యంలో కనపర్రు బీపీఆర్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆమె సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల బోధన తీరును చిన్నారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. 2017లో ఈ పాఠశాలలో కేవలం 23 మంది విద్యార్థులే చదువుకునేవారని, ప్రస్తుతం 64 మంది చేరారంటే ఉపాధ్యాయుల కృషే కారణమని తెలిపారు. హెచ్ఎం రాజ్యలక్ష్మి యోగా నిపుణురాలైనందున విద్యార్థులకు యోగాతో పాటూ మంచి క్రమశిక్షణ అలవర్చటం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో ముగ్గురు ఉపాధ్యాయులకు అదనంగా మరో ఇద్దరిని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని ఈబీ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఆమెతో పాటు నోడల్ ఆఫీసర్ ఎస్. పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

గుర్తు తెలియని వాహనం ఢీకొని టైలర్ మృతి

చిలకలూరిపేట టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని టైలర్ మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పట్టణంలోని సింగ్‌నగర్‌కు చెందిన టైలర్ ఆకుల శేషగిరి(58) భార్యాపిల్లల్ని వదిలి కొంతకాలంగా తల్లి దగ్గరే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి కడుపులో నొప్పిగా ఉందని ఇంట్లో చెప్పి బయటకు వచ్చాడు. ఈ సమయంలో ఇంటి సమీపంలోని బైపాస్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. తీవ్ర గాయాలైన అతన్ని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దైవజనుల వాక్కుతో ఆధ్మాత్మిక చింతన



చిలకలూరిపేట టౌన్: నిత్యం దేవుని సేవలో తరిస్తున్న దైవజనుల వాక్కు సారంగా ప్రజలు నడుచుకుంటే ఆధ్మాత్మిక చింతన అలవడుతుందని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. చిలకలూరిపేట మండలం కొత్తరాజాపేటలో తండ్రి సన్నిధి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా కూటముల ప్రార్థనల్లో ఆయన శనివారం పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాజశేఖర్‌ను సాదరంగా ఆహ్వానించిన పాస్టర్ షాలేంరాజు ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో గేరా లింకన్, సాతులూరు కోటి, ఇమ్మడి జానకీపతి, గ్రంధి ఆంజనేయులు, శరత్‌చంద్, రావూరి దాసు, జమీర్, ఆరా సుభాని పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న బాలినేని రామకృష్ణ

పెదకూరపాడు: యువతీ, యువకుల్లో క్రీడలపై ఆసక్తిని పెంపొందించడంలో నెహ్రూ యువ కేంద్రం, గుంటూరు కీలకపాత్రను పోషిస్తుందని ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) కో–ఆర్డినేటర్ బాలినేని రామకృష్ణ పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని జీఆర్సీ ఆర్‌కే శ్రీచైతన్య స్పోర్ట్స్ అకాడమీ క్రీడా ప్రాంగణంలో పల్నాడు జిల్లా స్థాయిలో నెహ్రూ యువకేంద్రం సౌజన్యంతో శనివారం జరిగిన క్రీడా పోటీలను బాలినేని రామకృష్ణ, స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు గుత్తా రాములు ప్రారంభించారు. బాలినేని రామకృష్ణ మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక, శారీరక ధృడత్వం పెరుగుతోందన్నారు. జీఆర్సీ ఆర్‌కే శ్రీ చైతన్య స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ గుత్తా రాము మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ నైపుణ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. పెదకూరపాడు, సత్తెనపల్లి, నరసరావుపేట, గురజాల నియోజకవర్గాల నుంచి వాలీబాల్, కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు. తొలిరోజు వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. జనచైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి విజయ్ బెన్నిబాబు, కో–ఆర్డినేటర్ తుళ్లూరి సాంబశివరావు, ఉపాధ్యాయులు అనిల్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ చోడుబోయిన వెంకట నాగరాజు, పీఈటీలు షేక్ అబుబకర్, పిట్టు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో టీడీపీ నేతల మధ్య ఘర్షణ

వినుకొండ: స్థానిక వెల్లటూరు రోడ్డులోని మిద్దె బావి స్థల వివాదంలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు నాయకుల మధ్య వివాదం తలెత్తింది. తనపై 32వ వార్డు కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి దాడి చేశాడని ఆరోపిస్తూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పల్లమీసాల దాసయ్య స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. కొంత కాలం నుంచి ఆక్రమణ విషయంలో ఇద్దరి మధ్యా వివాదం కొనసాగుతోంది. శనివారం తారస్థాయికి చేరడంతో ఒకరిపై మరొకరు దాడి చేసుకునే స్థాయికి వచ్చింది. పోలీసులు ఫిర్యాదు స్వీకరించి విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఇద్దరూ అధికార పార్టీకి చెందిన వారు కావడంతో స్థానిక ఎమ్మెల్యే, నాయకులు సర్ది చెప్పలేక తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

అసంపూర్తిగా కోటప్పకొండ తిరునాళ్ల పనులు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లు అసంపూర్తిగా ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. తిరునాళ్ల ఏర్పాట్లును శనివారం ఆయన పరిశీలించారు. కొండ దిగువున చిలకలూరిపేట మేజర్ కాలువ వద్ద శివ కుటుంబం పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. భక్తులు స్నానమాచరించే ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం కొండ మీదకు చేరుకొని ఆలయంలో ఏర్పాట్లపై సిబ్బందితో మాట్లాడారు. స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తిరునాళ్ల విజయవంతం కావాలని, భక్తులు క్షేమంగా తిరిగి వెళ్లాలని స్వామిని కోరుకుంటున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయలోపంతో పనులు అసంపూర్తిగా మిగిలాయని విమర్శించారు. కోటప్పకొండ– కొత్తపాలెం రోడ్డుతో పాటు పలు లింక్ రోడ్లు పనులు ఆలస్యంగా ప్రారంభించడం వల్ల ఇంకా పూర్తి కాలేదని తెలిపారు. స్నానాల ఘాట్ దగ్గర మెట్లు మరమ్మతులు చేపట్టాలని చెప్పారు. ఆదివారం నుంచే కొండకు భక్తులు రాక ప్రారంభమవుతుందని, పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. సీఎం చంద్రబాబు పర్యటన వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని, దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన ఆయన కోరారు. వీఐపీ పాస్‌లపై కూడా ప్రకటన చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాసరావు, పచ్చవ రవీంద్రబాబు, సర్పంచులు వెన్నపూస నాగిరెడ్డి, షేక్ పాదిలే ఖాజా, మట్లా లింగారెడ్డి, పాదర్తి వెంకటేశ్వరరావు, కనకా పుల్లారెడ్డి, పానుగోటి వెంకట్రావు పాల్గొన్నారు.



చిలకలూరిపేట మేజర్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్న వైఎస్సార్ సీపీ

రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీనే అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శనివారం గుంటూరురోడ్డులోని పార్టీ కార్యాలయంలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 68వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మైనార్టీ నాయకులతో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ నాయకులు సయ్యద్ ఖాదర్ బాషా, షేక్ కరీముల్లా, షేక్ ఖాదర్ బాషా, సిలార్ బాషా, యునిస్, సుభాని, ఎక్స్ కౌన్సిలర్ జిలాని, గౌస్‌పీర్, వరవకట్ట జిలాని, పీఆర్వో కరీముల్లా, అజ్మల్, జానీ బాషా, ఎస్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, గాబ్రియల్, విజయకుమార్, సురేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రైల్వే లైన్ ఆవశ్యకతపై మండలిలో ప్రస్తావిస్తా

ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

చిలకలూరిపేట: చిలకలూరిపేటకు రైల్వేలైన్‌ను ఏర్పాటు చేయాలని, దీని ఆవశ్యకత గురించి రానున్న శాసనమండలి సమావేశాల్లో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ హామీ ఇచ్చారు. శనివారం రైల్వే లైన్ సాధన సమితి ఆధ్వర్యంలో సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌ను ఆయన నివాసంలో కలసి రైల్వే లైన్ అంశాన్ని శాసనమండలిలో ప్రస్తావించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ స్పందిస్తూ ఈ ప్రాంతానికి రైల్వేలైను ఏర్పాటు చేయాలని గతం నుంచి ఎన్నో ప్రయత్నాలు కొనసాగాయన్నారు. రైల్వేలైన్ వల్ల చిలకలూరిపేటతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు బహుముఖ ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. ఇక్కడి స్పిన్నింగ్ మిల్లులు, పొగాకు పరిశ్రమ, బాపట్ల జిల్లా పర్చూరు, మార్టూరు గ్రానైట్ పరిశ్రమల నుంచి ఎగుమతులు, దిగుమతులు అయ్యే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. స్థానికంగా ఉన్న పలు పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు ఇతరా రాష్ట్రాలకు చెందిన వారేనని, వారి ప్రయాణ సౌకర్యానికి రైల్వేలైను ఎంతో అవసరమని తెలిపారు. దీంతో పాటు పర్యాటక రంగం అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా కొండవీడు వంటి చారిత్రక ప్రదేశాలకు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు చేరుకోవడానికి ప్రయాణం సౌకర్యంగా ఉంటుందని వెల్లడించారు. ఈ సందర్భంగా రైల్వే లైన్ సాధన సమితి కన్వీనర్ షేక్ సుభాని మాట్లాడుతూ చిలకలూరిపేటకు రైల్వేలైన్ ఏర్పాటు విషయంలో అన్ని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాల నాయకులు, పారిశ్రామికవేత్తలు సైతం సంఘీభావం ప్రకటించారని వెల్లడించారు. త్వరలోనే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రైల్వేలైన్ సాధన కోసం కార్యాచరణ ప్రకటించనున్నట్లు వెల్లడించారు. సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, ఎమ్మార్పీఎస్ నాయకులు అడపా మోహన్ మాదిగ, ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు షేక్ బాజి, జనక్రాంతి పార్టీ నాయకుడు గౌస్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైల్వేలైన్ సాధన సమితి నాయకులు

ఆయిల్ మిల్లుల్లో అధికారుల తనిఖీలు

- ఎనిమిది చోట్ల తనిఖీ.. అన్నిచోట్లా శుభ్రత లేని ట్యాంకులే..
- కేసులు నమోదు

నరసరావుపేట టౌన్: రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ డెప్యూటీ కమిషనర్ పూర్ణచంద్రరావు ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని ఎనిమిది ఆయిల్ మిల్లుల్లో తనిఖీలు చేశామని స్థానిక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. దాడులు అనంతరం ఆయన మీడియాకు వివరాలను వెల్లడించారు. నాలుగు జిల్లాల నుంచి ఎనిమిది మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను ఎనిమిది టీంలుగా ఏర్పాటుచేసి నరసరావుపేట ప్రాంతంలోని రీప్యాక్ ఆయిల్ మిల్లులను తనిఖీ చేశామన్నారు. ఎక్కడా ట్యాంకుల శుభ్రత కనిపించలేదున్నారు. వీరందరికీ నోటీసులు ఇవ్వటం జరుగుతుందని, అనుమానాస్పదంగా ఉన్న నూనె శాంపిల్స్ తీయటం జరిగిందన్నారు. వీటిని పరీక్షలకు పంపిస్తున్నామని, ఎక్కడ లోపం కన్పించినా వారిపై చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. వీరందరిపై నిరంతర నిఘా కొనసాగిస్తామన్నారు. వీరందరిపై ఎనిమిది కేసులు నమోదు చేశామన్నారు. మేము నరసరావుపేటలో 24 యూనిట్లకు లైసెన్సులు మంజూరుచేశామని, అన్నింటినీ తనిఖీ చేస్తామన్నారు. రిటైలర్లు, శనగనూనె మిల్లులపై కూడా చర్యలు తప్పక ఉంటాయని తెలిపారు.



తనిఖీలు చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ

'ఉయ్యాలవాడ' త్యాగం అసమానం

నరసరావుపేట: ఆంగ్లేయుల దుష్ట పాలనపై తాంతియా తోపే, ఝాన్సీ లక్ష్మీబాయిల కన్నా ముందే కత్తిదూసి, పోరాడి ఉరికంభం ఎక్కిన స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి కొనియాడారు. స్థానిక ప్రకాష్‌నగర్‌లో శనివారం రెడ్డి బిజినెస్ గ్రూపు (ఆర్‌బీజీ) ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చినరామిరెడ్డి మాట్లాడుతూ దేశం కోసం, దేశ స్వాతంత్ర్య సాధన కోసం ప్రాణాలర్పించిన రేనాటి వీరుడు ఉయ్యాలవాడ అని పేర్కొన్నారు. ప్రస్తుత తరానికి, యువతకు ఆయన పోరాటాన్ని వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. న్యాయవాది ఆరెకూటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉయ్యాలవాడ దేశ స్వాతంత్ర్యం కోసం తెల్లదొరలపై అలుపెరగని పోరాటంచేసి అసువులు బాశారని తెలిపారు. మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి మాట్లాడుతూ ఉయ్యాలవాడ బ్రిటిష్ పాలనపై పోరాటాలు చేసిన తెలుగు వీరుడని పేర్కొన్నారు. ఎల్ఐసీ ఏజెంట్ తియ్యగూర వీరారెడ్డి, ఇదా లింగారెడ్డి, వి.పెద్దిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, రామిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మోహనకృష్ణారెడ్డి, తుమ్మూరు శ్రీనివాసరెడ్డి, జీవీ సాంబశివరెడ్డి, యర్రంరెడ్డి నాగేశ్వరరెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.



ఉయ్యాలవాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్‌బీజీ గ్రూపు సభ్యులు

నిబంధనల ప్రకారం పోలింగ్ నిర్వహించండి

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై శిక్షణలో డీఆర్‌ఓ మురళి

నరసరావుపేట: గుంటూరు – కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించాలని ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్‌ఓ ఏకా మురళి ఆదేశించారు. ఈనెల 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధులకు సంబంధించి శనివారం కలెక్టరేట్‌లోని డాక్టర్ గుర్రం జాషువా సమావేశం మందిరంలో పోలింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణా తరగతులు నిర్వహించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ సామగ్రి స్వీకరించడం నుంచి పోలింగ్ అనంతరం తిరిగి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సీల్ చేసిన బ్యాలెట్ బాక్సులను సమర్పించే వరకు ప్రతి అంశం గురించి వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటువేసే విధానం సంక్లిష్టంగా ఉంటుందని, ఓటు వేసేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ఓటువేసే విధానం గురించి స్పష్టంగా తెలియజేయాలన్నారు. చెల్లని ఓట్లను గణనీయంగా తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, పీఓలు, ఏపీఓలు, ఎమ్మెల్సీ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌ఓ